

పోలీసుల సమక్షంలో ఇంటిని సీజ్ చేస్తున్న ఖైరతాబాద్ రెవెన్యూ సిబ్బంది

సింగోటం రాము హత్య జరిగిన ఇల్లు సీజ్

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనర్సింహనగర్‌లో ఈ యేడాది ఫిబ్రవరి 7న రియాల్టర్ సింగోటం రాము దారుణ హత్యకు గురయ్యాడు. రాము ప్రత్యర్థులతో చేతులు కలిపిన ఇమాంబి తన కుమార్తెతో హనీ ట్రాప్ వేసి ఇంటికి రప్పించి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య జరిగిన ఇంట్లో వ్యభిచార గృహం పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు స్థానికులతో పాటు యజమాని ధర్మారెడ్డి పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. తన ఇల్లు ఆక్రమణకు గురైందని ధర్మారెడ్డి పోలీస్ ఉన్నతాధికారులను సైతం ఆశ్రయించాడు. ఆరోపణల నేపథ్యంలో విచారణ జరిపిన పోలీసులు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్ధారించారు. సికింద్రాబాద్ ఆర్డీఓకు నివేదిక అందచేయడంతోపాటు ఇంటిని సీజ్ చేయాలని కోరారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు ఆదివారం పోలీసులు, ఖైరతాబాద్ రెవెన్యూ అధికారులు ఇంటిని ఖాళీ చేయించి సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో స్థానికంగా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఇంటిని సీజ్ చేసినట్టు చెప్పారు. నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు జరుగుతుందన్నారు.



ఉత్పత్తులతో నటి నాగ భార్గవి

సత్యసాయిలో జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ కాలనీలోని సత్య సాయి నిగమాగమంలో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను ఆదివారం యూట్యూబర్, ఫన్ బకెట్ నాగ భార్గవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్ లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలేదన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు ప్రతి ఒక్కరూ చేనేతను మరింత ఆదరించాలన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఈ నెల 14వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని వెల్లడించారు.



దేవాలయం వద్ద పేరుకుపోయిన మట్టిని, రాళ్లను తొలగిస్తున్న సిబ్బంది

దేవాలయం వద్ద రాళ్ల తొలగింపు

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వరద కారణంగా ముంపునకు గురైన దేవాలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు జీహెచ్ఎంసీ అధికారులు పనులు మొదలు పెట్టారు. ఫిలింనగర్ బాల్‌రెడ్డినగర్‌లో పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షం కారణంగా వరదతో పాటు ఎగువ ప్రాంతంలో ఉన్న మట్టి, రాళ్లు కొట్టుకువచ్చి మైసమ్మ దేవాలయం ముంపునకు గురైంది. ప్రహరీ కూడా కూలడంతో ఆలయంలో పూజాధికాలు నిలిచిపోయారు. బోనాలు మొదలవ్వడంతో స్థానికులు విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసా అధికారులను వెంటనే పనులు నిర్వహించాలని కోరారు. ఆదివారం మట్టిని, రాళ్లను తొలగించే పని మొదలైంది.

చెస్ కోచ్ చైతన్య సురేష్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న చైతన్య సురేష్

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన చీఫ్ చెస్ కోచ్ చైతన్య సురేష్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. మలేషియాలోని ది థేమ్స్ ఇంటర్నేషనల్ యునివర్సిటీ ఆఫ్ ఫ్రాన్స్ ఆధ్వర్యంలో ఇండో గ్లోబల్ సమ్మిట్ అవార్డ్స్‌లో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చైల్డ్ సైకాలజీ ఇన్ రెఫరెన్స్ ఆఫ్ చెస్‌లో గౌరవ డాక్టరేట్‌ను యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. ఆదివారం నగరానికి వచ్చిన డాక్టర్ చైతన్య సురేష్ మాట్లాడుతూ ఏకాగ్ర చెస్ అకాడమీ ద్వారా అనేక మంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, చెస్‌లో భారత్‌ని అగ్రగామిగా నిలపడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. చైతన్యను ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ సందీప్ నాయుడు అభినందించారు.



మొక్కను నాటుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్

పచ్చదనం అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత

● మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం అభివృద్ధి చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యం అవుతుందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ప్రధాని మోదీ ఏక్ పేడ్ మాకే నామ్ నినాదం మేరకు ఆదివారం నాగార్జుననగర్ కాలనీ బీజేపీ కార్యాలయం ఆవరణలో నాయకులు మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా హాజరైన చింతల మాట్లాడుతూ మొక్కలు నాటడంతోనే సరిపోదని దాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం బీజేపీ నాయకులు లంకల దీపక్‌రెడ్డి, కిలారి మనోహర్, కుంభాల గంగరాజు, ప్రేంకుమార్, రామకృష్ణ, అనంతలక్ష్మి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

యూసుఫ్‌గూడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యూసుఫ్‌గూడ పరిసర ప్రాంతాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో పోలీసులు నిఘా వేశారు. ఆదివారం యూసుఫ్‌గూడలో ఆర్.వెంకటేష్ అనే వ్యక్తి మద్యం విక్రయిస్తు పోలీసులకు కనిపించాడు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకుని విచారించారు. మద్యం విక్రయిస్తున్నట్లు ఆయన అంగీకరించాడు. అతని వద్ద ప్రెస్టేజ్ విస్కీ 48 క్వార్టర్ బాటిల్స్, ఆఫీసర్స్ చాయిస్ 90 ఎంఎల్ రెండు బాటిల్స్ మొత్తం 50 బాటిల్స్ సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి భారీ బందోబస్తు

● ఆలయ పరిసరాల్లో 100 సీసీ కెమెరాల ఏర్పాటు
● ఆరు వందల మంది పోలీస్ బలగాలతో పహారా
● ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లు ● ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ



బల్కంపేటలో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెంటర్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

అమీర్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బల్కంపేటలో ఈ నెల 9న వైభవంగా జరుగనున్న రేణుక ఎల్లమ్మ కల్యాణం ప్రశాంత వాతావరణలో నిర్వహించేందుకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు అసాధారణ భద్రత ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో మమేకమైన పోలీసులు కల్యాణం తిలకించి అమ్మవారిని దర్శించుకుందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన భద్రత వివరాలను ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కలిసి ఆదివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం ముందు ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ మానిటరింగ్ సెంటర్‌లో వెల్లడించారు. ఎల్లమ్మ కల్యాణం ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు డీసీపీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో 3 ఏసీపీలు 22 మంది సీఐలు, 72 మంది ఎస్ఐలతో పాటు 6 వందల మంది పోలీస్ సిబ్బంది, 12 ప్లాటున్ల ఏఆర్ బలగాలు వీరితో పాటు మఫ్టీలో ఉండే టాస్క్‌ఫోర్స్ షీ టీమ్‌లు నేటి నుంచి విధులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏలాంటి సంఘటన జరిగిన అప్రమత్తం అయ్యేందుకు ఆలయం చుట్టు పక్కల మరో 19 సబ్ కంట్రోల్ రూమ్‌లను 2 వందల మీటర్ల పరిధిలో ఏర్పాటు చేసి ఒక్కో సెంటర్‌కు ఎస్ఐ స్థాయి అధికారితో పాటు 8 మంది కానిస్టేబుళ్లను నియమించడం జరిగిందన్నారు. ప్రధానంగా నేరాలు, దొంగతనాలు జరగకుండా 10 క్రైం టీమ్ బృందాలను రంగంలోకి దిగి అసాంఘిక కార్యాకలాపాలు, కొట్లాటలు, దోపిడీ, దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా విధులు నిర్వహిస్తారని వెల్లడించారు.

ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లు.....

అమ్మవారి కల్యాణం వీక్షించేందుకు బల్కంపేట ఆలయానికి వస్తున్న భక్తుల రక్షణ దృష్ట్యా ఇరువైపుల ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏప్పాటు చేస్తున్నారు.

100 సీసీ కెమెరాల ఏర్పాటు

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం నేపథ్యంలో ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ మానిటర్ సెంటర్‌కు అనుసంధానించి పర్యవేక్షిస్తున్నారు.

ఆలయం సమీపంలో ఉన్న మద్యం దుకాణాలు మూసి వేయాలని నిర్వాహకులకు నోటీసులు జారీ చేసారు. ఈ నెల 9 ఉదయం 6 గంటల నుంచి 11వ తేదీ ఉదయం 6 గంటల వరకు బల్కంపేట సతీష్ వైన్స్, ఎస్ఆర్‌నగర్‌లోని సరోవర్ బార్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న అక్షయ బార్ రెండు రోజుల పాటు మూత పడనున్నాయి.

రూట్ మ్యాప్ విడుదల

ఎల్లమ్మ కల్యాణానికి 4 రోజుల ముందే బల్కంపేట ప్రధాన రహదారిని బారీ కేడ్లతో మూసివేసిన ట్రాఫిక్ పోలీసులు ఆదివారం అధికారిక రూట్ మ్యాప్‌ను విడుదల చేసారు. అమీర్‌పేట, బేగంపేట నుంచి వచ్చి బల్కంపేట, ఫత్తేనగర్, సనత్‌నగర్ వైపు వెళ్లే వాహనాలను ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మీదుగా సోని వైన్స్, అభిలాష్ టవర్స్ ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్, బీకేగూడ క్రాస్ రోడ్ శ్రీరామ్‌నగర్ మీదుగా దారి మళ్లిస్తున్నారు. ఫత్తేనగర్, సనత్‌నగర్, బేగంపేట వైపు నుండి ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట వైపు వెళ్లే వాహనాలను శ్రీరామ్‌నగర్ మీదుగా బీకేగూడ క్రాస్ రోడ్, ఎస్ఆర్‌నగర్ కమ్యూటీ హాల్ సోని వైన్స్ మీదుగా ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట వైపు దారి మళ్లిస్తున్నారు. ఈ ఆంక్షలు 10 వ తేదీ రాత్రి 8 గంటల వరకు అమలులో ఉండనున్నాయి.

పార్కింగ్ కేంద్రాలను మాత్రం అమీర్‌పేట జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్, ప్రకృతి చికిత్సాలయం, ఎస్ఆర్‌నగర్‌లోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయంతో పాటు ఫత్తేనగర్ రైల్వే స్టేషన్ పై ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటు చేసారు.

బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● కుల గణన, రెండు లక్షల ఉద్యోగాల సాధన కోసం 15న చలో సచివాలయం ముట్టడి



సచివాలయం ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కృష్ణయ్య, రాజారాం యాదవ్, బత్తుల సిద్దేశ్వర్, తదితరులు

పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కొనుగోలు చేసి తన సీటును పదిలం చేసుకునే పనిలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని వక్తలు ఆరోపించారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ ఎల్చాల దత్తాత్రేయ, టి.జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, తదితరులతో కలిసి సమగ్ర కులగణన, రెండు లక్షల ఉద్యోగాల సాధన కోసం ఈ నెల 15న తలపెట్టిన చలో హైదరాబాద్ సచివాలయం ముట్టడి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ పదవుల్లో తీవ్రమైన అన్యాయానికి గురవుతున్న బీసీలకు స్థానిక సంస్థల్లోనూ ప్రాతినిధ్యం వహించే అవకాశం ఇవ్వాలని ప్రశ్నించారు. సమగ్ర కులగణన జరిపి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ నెల 15న తలపెట్టిన చలో సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని బీసీ కుల సంఘాలు, బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని, గ్రూప్- 2లో 2 వేలు, గ్రూప్-3లో 3 వేల ఉద్యోగాలు పెంచడంతోపాటు గ్రూప్-1 మెయిన్స్‌కి 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గోవర్ధన్, అల్లంపల్లి రామకోటి, ఏ.రామ్మూర్తి గౌడ్, కొంపెల్లి రాజు, లింగం శాలివాహన, కొంగర నరహరి, పలు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సనత్‌నగర్ నియోజకవర్గం సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

గ్రేటర్‌లో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యం

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో బీజేపీని పూర్తి స్థాయిలో బలోపేతం చేయడమే తమ లక్ష్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాలలో బీజేపీ జెండా ఎగురవేయాలన్నదే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు పని చేయాలని ఆయన కోరారు. ఎంపీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీ అందించారని, వారికి ఎంతో రుణపడి ఉంటానన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అంకితభావంతో పని చేశారన్నారు. ఏ ఎన్నికలు జరిగిన బీజేపీదే విజయం అని, ఏ శక్తులు అడ్డుకోలేవని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలపై కార్యకర్తలు దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు. మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనాథాశ్రమానికి నిత్యావసరాలను అందజేస్తున్న ధోనీ అభిమానులు

ఘనంగా ధోనీ జన్మదిన వేడుకలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 43వ పుట్టినరోజు వేడుకలను అతడి అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ధోనీ తెలుగు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని చిల్డ్రన్ వెల్ఫేర్ అనాథాశ్రమంలో ఈ వేడుకలు జరిగాయి. అనాథాశ్రమంలోని 100 మంది పిల్లలకు క్రికెట్ కిట్లు, ఇతర క్రీడా సామగ్రి, దుస్తులు, నిత్యావసరాలను ధోనీ ఫ్యాన్స్ ఇచ్చారు. మహీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు.



లోగోను ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు మారుతి

యువతను ప్రోత్సహించేందుకే జామ్ జంక్షన్

బంజారాహిల్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధిగాంచిన మ్యూజికల్ బ్యాండ్స్‌ను ప్రోత్సహించేందుకు జామ్ జంక్షన్ పక్కా రీజనల్ పేరుతో ఉత్సాహభరిత పోటీని నిర్వహిస్తున్నట్లు దర్శకుడు మారుతి తెలిపారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జామ్ జంక్షన్ పక్కా రీజనల్ కార్యక్రమం పోస్టర్‌ను ఆదివారం ఆయన సినీ నిర్మాత ఎస్ కె ఎన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ నగరంలో ప్రస్తుతం మ్యూజికల్ బ్యాండ్ ట్రెండ్ కొనసాగుతుందని యతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 6న హైటెక్స్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీలో నగరంలోని ప్రధాన బ్యాండ్‌లు పాల్గొంటారని వెల్లడించారు. ఇండియాలోని తొలిసారిగా రీజినల్ మ్యూజికల్ బ్యాండ్ పోటీలు స్థానిక భాషల్లో నిర్వహిస్తున్నామని త్వరలోనే ఇతర భాషల్లో కూడా వీటిని నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో దర్శకుడు అనిల్ కుమార్, ఈవెంట్ ఫౌండర్ శ్రీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రావు

చిత్ర పరిశ్రమలో అన్యాయాలపై దృష్టి సారించండి

● సీఎంకు సినీ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్టు యూనియన్ విజ్ఞప్తి

పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చిత్ర పరిశ్రమలో తీవ్ర ఆర్థిక దోపిడీకి గురవుతున్న జూనియర్ ఆర్టిస్టుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించాలని తెలుగు సినీ, టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్(సీఐటీయూ) సలహాదారు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈశ్వర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ నాయకులు ఎం.వెంకటేష్, శంకురి రవీందర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. చిత్ర పరిశ్రమలో అడుగడుగునా వంచనకు గురవుతున్నది జూనియర్ ఆర్టిస్టులేనని అన్నారు. నిబంధనల ప్రకారం జూనియర్ ఆర్టిస్ట్‌కి రోజుకు 900 రూపాయలు చెల్లించాల్సి ఉండగా, ఆవిధంగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అసలైన ఆర్టిస్టులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఏజెంట్ల వ్యవహార శైలితో వేలాదిమంది జూనియర్ ఆర్టిస్టులు రోజు గడవని దుస్థితిలో కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. చిత్రపురికాలనీలో జరుగుతున్న అవినీతి అక్రమాలతో యావత్ సినీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కనీస కార్మిక చట్టాలు అమలు కాక దోపిడీకి గురి అవుతున్నామని అన్నారు. చిత్రపరిశ్రమంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రత్యేకగా దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్.కె సుభాని, రవి శంకర్, రవితేజ, సత్యం, రాజు, నరేష్, పాల్గొన్నారు.

రాష్ట్ర చెస్ అసోసియేషన్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలి


పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్‌లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలని అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు మేజర్ కె.ఏ శివప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ధన, సీనియర్ కోచ్ కంది రవిలతో కలిసి ఆయన మాట్లాడారు. అసోసియేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలతో నైపుణ్యవంతులైన క్రీడాకారులు క్రీడకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాకారులకు శిక్షణ, ఇతర అవసరాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. అసోసియేషన్‌లో ఇప్పటికే సుమారు రెండు కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్లు ఆయన తెలిపారు. దీనిపై ఇప్పటికే తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. సమగ్ర విచారణ జరిపించి నిధులు దారి మళ్లకుండా చూడాలని, దోషులను శిక్షించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విల్లా.. గుల్ల

● తాళాలు పగులగొట్టి చోరీ
● 40 తులాల బంగారం, లక్ష నగదు అపహరణ

కొత్తపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగర శివారు పతుల్లాగూడ గేటెడ్ కమ్యూనిటీలోని ఓ విల్లాలో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. నాగోలు ఎస్‌హెచ్ఓ సుధీర్‌కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పతుల్లాగూడలోని గోల్డెన్ లీఫ్స్ విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీలోని నెం.89 విల్లాలో విశ్రాంత పోస్టల్ ఉద్యోగి పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఇటీవలే కుమార్తె విదేశాల నుంచి రావడంతో అందరూ కలిసి ఈనెల 3న పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లారు. మరో విల్లా (నెం.22)లో ఉంటున్న నీరజారెడ్డి కుటుంబ సభ్యులు కూడా బంధువుల ఇంటికి వెళ్లారు. అయితే, శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు నంబర్ 89 విల్లా తాళాలు పగులగొట్టి బెడ్‌రూంలోని కప్‌బోర్డులో దాచిన 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్న పురుషోత్తంరెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం చూసి చోరీ జరిగినట్లుగా అనుమానించి కమ్యూటీ అసోసియేషన్ వారి సహకారంతో నాగోల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య, అడిషనల్ డీసీపీ క్రైమ్స్ శ్రీనివాస్, పోలీసు జాగిలాలు, క్లూస్ టీం, వేలిముద్రల నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

విల్లా ఎదురుగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు యువకులు చోరీచేసి వెళుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి.



దొంగలు చోరీ చేసిన విల్లా

పనిచేయని సీసీ కెమెరాలు..

ఈ గేటెడ్ కమ్యూనిటీలో 54 సీసీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు గుర్తించారు. విల్లాల వెనుక మూసీ వైపు ఖాళీ ప్రదేశం ఉండడంతో ప్రహరీని సులభంగా దూకి దుండగులు లోనికి ప్రవేశించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. చోరీచేసి పరారయిన దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా 3 సీసీయస్ పోలీసుల బృందాలు, 3 ఎల్బీనగర్ జోన్ బృందాలు రంగంలోకి దిగాయని సమాచారం. ఇటీవలే కొత్తగూడెం వద్ద పార్థీగ్యాంగ్ సభ్యుల్లో ఇద్దరిని నల్లగొండ పోలీసులు పట్టుకున్న సంఘటనను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. ఆ గ్యాంగ్‌లోని మిగతా సభ్యులే గేటెడ్ కమ్యూనిటీ విల్లాలో చోరీ చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ గేటెడ్ కమ్యూనిటీలో చోరీ తీరుమాత్రం అందుకు భిన్నంగా ఉందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

మహిళలపై అఘాయిత్యాల నిర్మూలన కోసం పరుగు



అవగాహన రన్‌ను ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ తదితరులు

ఖైరతాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ జరిగిన రన్ ఆలోచింపజేసింది. హ్యూమన్స్ ఎగెనెస్ట్ రేప్ అండ్ డిస్క్రిమినేషన్ అనే సంస్థ ఆధ్వర్యంలో పివి నర్సింహారావు మార్గంలోని సంజీవయ్య పార్కు నుంచి పీపుల్స్ ప్లాజా వరకు జరిగిన ఈ పరుగును టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ అతిథిగా హాజరై ప్రారంభించారు. 3 కే, 5 కే, 10 కేలుగా మూడు విభాగాల్లో జరిగిన ఈ రన్‌లో పెద్ద ఎత్తున యువత, విద్యార్థులు పాల్గొన్నారు. సమాజాన్ని జాగృత పరచాల్సిన అవసరం ఉన్నదన్నారు. కార్యక్రమ నిర్వాహకులు, గిన్నిస్ రికార్డు గ్రహీత కెఎస్ఆర్ నాగరాజు, ప్రతినిధులు ధనుష్, మంజునాద్, నరేష్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో యువకుడి అదృశ్యం

● ఉప్పల్‌లో జీరో ఎఫ్ఐఆర్.. కాచిగూడకు బదిలీ

బర్కత్‌పుర జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడితో డబ్బుల విషయంలో మాట్లాడటానికి ఉప్పల్ నుంచి నెహ్రూనగర్‌కు వచ్చిన యువకుడు అదృశ్యమయ్యాడు. దాంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాచిగూడ పీఎస్‌కు బదిలీ చేశారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అడ్మిని ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నేరెళ్లపల్లి గుడిగుంట తండాకు చెందిన రాజేష్(23) తన అన్న సూర్యతో కలిసి ఉప్పల్ చిలుకానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇన్వెస్ట్మెంట్ పథకం పేరుతో రాజేష్ తన స్నేహితుల నుంచి రూ.20 వేల చొప్పున వసూలు చేశాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని స్నేహితులు ఒత్తిడి తేవగా రాజేష్ ఇద్దరికీ డబ్బులు తిరిగి ఇచ్చేశాడు. మరొక స్నేహితుడికి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా అతనితో మాట్లాడటానికి శుక్రవారం కాచిగూడ పీఎస్ పరిధిలోని నెహ్రూనగర్‌కు వచ్చాడు. ఆ తర్వాత అతడు కనిపించకుండా పోయాడు. శనివారం రాజేష్ సోదరుడు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు ఆదివారం కాచిగూడ పీఎస్‌కు బదిలీ చేశారు. కాచిగూడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సికింద్రాబాద్ ఇస్కాన్ దేవాలయం నుంచి జగన్నాథ రథయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

పేదలకు చేయూత అభినందనీయం

● **ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

మారేడుపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు చేయూతను అందించడం అభినందనీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసానిశ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం రాంగోపాల్‌పేట్ డివిజన్ నల్లగుట్టకు చెందిన లక్ష్మికి ప్రైమ్ రిహేబ్ సొల్యూషన్స్‌కు చెందిన డైరెక్టర్ డాక్టర్ హారిక 22వేల రూపాయల విలువైన వినికిడి పరికరాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా వెస్ట్ మారేడుపల్లిలోని నివాసంలో అందజేశారు. మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హెల్త్ క్యాంప్‌లో వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు లక్ష్మికి వినికిడి లోపం ఉందని, సమస్య పరిష్కారం కోసం వినికిడి యంత్రాన్ని వినియోగించాలని సూచించారు. ఆర్థికంగా అంత స్థోమత లేని లక్ష్మికి ప్రైమ్ రిహేబ్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో వినికిడి యంత్రం అందజేసేందుకు ముందుకు వచ్చి అందజేయడం పట్ల డాక్టర్ హారికను ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ ప్రశంసించారు.

అడ్డగుట్టలో ఎంసీపీఐ కార్యకర్తల శిక్షణా తరగతులు

అడ్డగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు కమ్యూనిస్టు పార్టీల పోరాటాలు ప్రత్యామ్నాయమని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. ఆదివారం అడ్డగుట్ట ఎంసీపీఐ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు అడ్డగుట్టలో కామ్రేడ్ ఉపేంద్ర స్థూపం వద్ద జిల్లా కార్యదర్శి జి.మల్లేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన పది సంవత్సరాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి పేరుతో అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంభించడంతో ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి అనిల్, కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుధాకర్, కమిటీ సభ్యులు మల్లేష్, రాంబాబు, యాదగిరి, లక్ష్మణ్, లక్ష్మి, రాజు, లావణ్య శివాని, లలిత పార్వతి, నరసింహ, రవి, లక్ష్మిలు పాల్గొన్నారు.



సనత్‌నగర్ నియోజకవర్గం సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

గ్రేటర్‌లో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యం

● **కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో బీజేపీని పూర్తి స్థాయిలో బలోపేతం చేయడమే తమ లక్ష్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాలలో బీజేపీ జెండా ఎగురవేయాలన్నదే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆయన కోరారు. ఎంపీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీ అందించారని, వారికి ఎంతో రుణపడి ఉంటానన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేశారన్నారు. ఏ ఎన్నికలు జరిగినా బీజేపీదే విజయం అని, ఏ శక్తులు అడ్డుకోలేవని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై కార్యకర్తలు దృష్టి సారించాలని కోరారు. మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు. మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

లాల్‌బజార్ మహంకాళి దేవాలయంలో ఘనంగా కలశ పూజ

తిరుమలగిరి, జులై 7 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్ శ్రీమహంకాళి దేవాలయంలో ఆదివారం ఆషాడం మొదటి ఆదివారం పురస్కరించుకుని టైగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి 108 కలశాలతో పంచనదీ జలాలతో మహా సంప్రోక్షణ అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఈఓ సత్యచంద్రారెడ్డి, మహేందర్ రెడ్డిలు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహంకాళి మందిరం అధ్యక్షులు మురళీ ముదిరాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ భక్తవత్సలం, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ఘనంగా ఆషాఢ మాసం పూజలు

సికింద్రాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అన్నానగర్‌లోని పోచమ్మ ఆలయంలో ఆషాఢ మాసం తొలి ఆదివారం పూజలు ఘనంగా జరిగాయి. అన్నానగర్, అర్జున్‌నగర్, బాలంరాయి, అంబేడ్కర్‌నగర్, రసూల్‌పురా బస్తీల ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ సభ్యుడు దేవులపల్లి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు మద్దెల యాదగిరి, ధర్మేందర్, అన్నానగర్ మురళి, పి.వెంకటేష్, అచ్యుత శర్మ తదితరులు పూజలో పాల్గొన్నారు.



ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణ, సభ్యుడు దేవేందర్‌యాదవ్‌ను సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్

ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులకు సత్కారం

బౌద్ధనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయం నూతనంగా నియమితులైన ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులను ఆదివారం ఆలయంలో ఘనంగా సత్కారించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ ఆలయచైర్మన్ గుంటికృష్ణ, సభ్యులు దేవేందర్ యాదవ్, జగన్‌రెడ్డి, ఎక్స్‌అఫీషియో సభ్యుడు, ప్రధానార్చకుడు తిరుమలాచార్యులకు పూలదండలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈనెల 28, 29వ తేదీల్లో జరిగే అమ్మవార్ల జాతర ఘనంగా జరిపించాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రవిప్రసాద్‌గౌడ్ ఆలయ ధర్మకర్తలమండలి సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్, ప్రభు, రాజు, పంపరయాదగిరి, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్

బోయిన్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బోయిన్‌పల్లిలో చిన్న వానపడినా మ్యాన్ హోల్స్, డ్రైనేజీలు, నాలాలు పొంగిపొర్లుతున్నాయి. మురుగునీరు రోడ్లపైకి చేరి నిలిచిపోతుండగా వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని బోర్డు అధికారులు చెబుతున్నా.... క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే రెండు, మూడు చిన్నపాటి వర్షాలు పడగా, చాలా బస్తీలు, కాలనీల్లోని మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లి మురుగు రోడ్లపైనే నిలిచిపోయింది. ముఖ్యంగా రద్దీగా ఉన్న రూట్లలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. మరోవైపు పైన వున్న కాలనీలలోని ఇళ్లలోని వ్యర్థాలన్నీ లోతట్టు ప్రాంతాల రోడ్లపైకిచేరి తీవ్ర దుర్గంధం కలిగిస్తున్న సమస్య లోతట్టు కాలనీలు, బస్తీలలో అధికంగా ఉంది. ప్రతిరోజు బోయిన్‌పల్లి 1, 6వ వార్డులలో ఉండే స్థానికుల నుంచి ఫిర్యాదులు కూడా పెరిగాయి. సివరేజి సిబ్బంది తక్కువగా ఉండడంతోనే యాక్షన్ ప్లాన్ నత్తనడకన కొనసాగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.



బోయిన్‌పల్లి గణేష్‌నగర్ కాలనీలో ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ మ్యాన్‌హోల్స్



న్యూసిటీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్ పైన రేకులు పెట్టిన స్థానికులు

పదిరోజులుగా పెరిగిన ఫిర్యాదులు

వానాకాలానికి ముందు నుంచే మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌ను కంటోన్మెంట్ బోర్డు అమలు చేస్తోంది. ఇప్పటికే మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, డ్రైనేజీ పైపు లైన్లు, సివరేజి లైన్ల అభివృద్ధి వంటి పనులను కొనసాగిస్తోంది. యేటా అమలు చేస్తున్నా గాడిలో పడడంలేదు. ఇళ్ల నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు, సివరేజి పైపులైన్ల డ్యామేజీతో మ్యాన్‌హోల్స్ నిండిపోతున్నాయి. దీంతో చిన్నపాటి వానలకే ఓవర్ ఫ్లో అవుతున్నాయి. 10 రోజులుగా బోర్డు పరిధిలోని అన్ని కాలనీల స్థానికుల నుంచి ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. కాలనీలు, నాలా పరిధిలోని ప్రాంతాల నుంచే ఎక్కువగా వస్తున్నాయి. ఇప్పటివరకు వందకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లుగా అధికారులు తెలిపారు.

బస్తీలలో అధ్వానంగా

కంటోన్మెంట్ 1వ వార్డులోని న్యూసిటీ కాలనీ ప్రధాన రహదారితో పాటు కంటోన్మెంట్ 6వ వార్డులోని గణేష్‌నగర్ కాలనీ, సీతారాంపురం, మర్రి రామ్‌రెడ్డి కాలనీలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్యలే ఎక్కువగా ఉన్నాయి. స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా అధికారులు త్వరితగతిన స్పందించడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బోర్డు సిబ్బంది చెత్తచెదారం, వ్యర్థాలను సకాలంలో తీయకపోవడంతో దుర్గంధంతోపాటు దోమలతో ఇబ్బంది పడుతున్నామని బోయిన్‌పల్లిలోని వివిధ కాలనీలకు చెందిన స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా కంటోన్మెంట్ బోర్డు అధికారులు స్పందించి బోయిన్‌పల్లి ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీల మ్యాన్ హోల్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వర్షాలు పెద్దగా పడకముందే డ్రైనేజీల మ్యాన్ హోల్స్‌లోని మట్టిని, చెత్తచెదారాన్ని తీసి మూతలులేని డ్రైనేజీల మ్యాన్ హోల్స్‌లకు మరమ్మతులు చేయించాలని ఆయా కాలనీల ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

గల్లీల్లో ట్రాఫిక్ జామ్‌లు

రోజులు గడుస్తున్నా మురుగు క్లియర్ చేయడంలో వాటర్‌బోర్డు సిబ్బంది అలస్యం చేస్తున్నారు. దీంతో కాలనీలు, బస్తీల్లోని రోడ్లపై మురుగు పారుతోంది. మరో రూట్‌లో వెళ్తున్న సందర్భాల్లో గల్లీల్లో ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. మెయిన్ రోడ్లపై నుంచి వెళ్తున్నా ఇబ్బందిగానే ఉంటుందని స్థానికులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు



డ్రైనేజీల మ్యాన్‌హోల్ పూర్తిగా కూలిపోయింది. నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని గుర్తించి దానిపైన రేకులను పెట్టాను. మరమ్మతులు చేయాలని అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదు. -చింతకింది జగన్నాథం

ప్రమాదాలు జరగకముందే మరమ్మతులు చేయాలి



డ్రైనేజీల మ్యాన్‌హోల్స్ దాదాపుగా పడిపోయాయి. తరచు చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాలలో వాహనాలు గుర్తించకపోవడంతో వాటిలోపడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. బోర్డు అధికారులు కుంగిపోయి పాడైపోయిన డ్రైనేజీల మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలి. -నిర్మల

కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి జులై 7 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బొల్లారంలోని జై భీమ్ భవన్‌లో తోటి, మెథర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాటాడుతూ తోటి, మేథరి సామాజిక వర్గం కంటోన్మెంట్‌లో బలంగా ఉందని, వారందరికీ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రావలిసిన పథకాలను వర్తింపజేసి ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. వారంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. కంటోన్మెంట్‌లో మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేస్తున్నామని, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోడానికి నైపుణ్యశిక్షణా కేంద్రాలను ఏర్పాటుచేసి ఆర్థికంగా బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జైప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఖదీరవన్, మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.నరసింహన్, తోటి సంఘం అధ్యక్షుడు అమర్ రాజ్, కార్యదర్శి కే.రవిప్రసాద్ తెలంగాణ తోటి, మేథరి సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తోటి, మేథర్ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

పుష్కలంగా మంచి నీటిని అందిస్తాం

మారేడుపల్లి : కాలనీ, ఆపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న ప్రజలకు మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. ఆదివారం కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు పరిధిలోని కాకా గైడా శాంతిదీప్ కాలనీలో అపార్ట్‌మెంట్‌కు చెందిన ఫ్లాట్ల యువజనులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి శ్రీగణేష్‌కు మంచినీటి సదుపాయం కల్పించాలని కోరుతూ సమస్యపై వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ....

కాలనీ, ఆపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న ప్రజలకు మంచినీటిని అందించేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి యజమానికి సరిపడు మంచి నీటిని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి అపార్ట్‌మెంట్స్ సభ్యులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి : బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ఒకటవ వార్డు పరిధిలోని బోయిన్‌పల్లిలో గల పలు బస్తీలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని, ఇందుకోసం అధికారులతో చర్చించినట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు.

బస్తీ పర్యటనలో భాగంగా బోయిన్‌పల్లి వార్డు-1 చిన్నతోకట్ట సంజీవయ్యనగర్ బస్తీలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు.

రూ.19.70లక్షలతో రోడ్డు నిర్మాణం

రెజిమెంటల్‌బజార్ : కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బస్తీ పర్యటనకు వచ్చినపుడు స్థానికులు రోడ్డు పునర్‌నిర్మాణం గూర్చి ఎమ్మెల్యేకు ఏకరువుపెట్టడంతో ఆయన ఆదేశాలతో రోడ్డు నిర్మాణంకు మోక్షం లభించింది. ఇరవై రోజుల క్రితం మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో 9-3 లైన్‌లో బస్తీ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు సంవత్సరం క్రితం రోడ్డు తవ్వి పునర్‌నిర్మించకుండా వదిలివేయడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. సాధ్యమైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయిస్తానని హామి ఇచ్చిన ఎమ్మెల్యే, ఇచ్చిన హామీ ప్రకారం రోడ్డు నిర్మాణంకు రూ.19.70లక్షల నిధులు మంజూరు చేయించారు. సోమవారం రోడ్డు పనులు ప్రారంభించడానికి జీహెచ్ఎంసీ అధికారులు శిలాఫలకం సిద్ధం చేశారు. రోడ్డు సమస్య తీరుతుండటంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విల్లా.. గుల్ల

● తాళాలు పగులగొట్టి చోరీ
● 40తులాల బంగారం, లక్ష నగదు అపహరణ

కొత్తపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ఫతుల్లాగూడ గేటెడ్ కమ్యూనిటీలోని ఓ విల్లాలో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి 40తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. నాగోలు ఎస్‌హెచ్ఓ సుధీర్‌కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..

ఫతుల్లాగూడలోని గోల్డెన్ లీవ్స్ విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీలోని నెం.89 విల్లాలో విశ్రాంత పోస్టల్ ఉద్యోగి పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఇటీవలే కుమార్తె విదేశాల నుంచి రావడంతో అందరూ కలిసి ఈనెల 3న పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లారు. మరో విల్లా (నెం.22)లో ఉంటున్న నీరజా రెడ్డి కుటుంబ సభ్యులు కూడా బంధువుల ఇంటికి వెళ్లారు. అయితే, శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు నంబర్ 89 విల్లా తాళాలు పగులగొట్టి బెడ్‌రూంలోని కపబోర్డులో దాచిన 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్న పురుషోత్తం రెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం చూసి చోరీ జరిగినట్లుగా అనుమానించి కమ్యూటీ అసోసియేషన్ వారి సహకారంతో నాగోల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య, అడిషనల్ డీసీపీ క్రైమ్స్ శ్రీనివాస్, పోలీసు జాగిలాలు, క్లూస్ టీం, వేలిముద్రల నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. విల్లా ఎదురుగా ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా ఇద్దరు యువకులు చోరీచేసి వెళుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి.

పనిచేయని సీసీ కెమెరాలు..

ఈ గేటెడ్ కమ్యూనిటీలో 54 సీసీ కెమెరాలు పని చేయడం లేదని పోలీసులు గుర్తించారు. విల్లాల వెనుక మూసీ వైపు ఖాళీ ప్రదేశం ఉండడంతో ప్రహరీని సులభంగా దూకి దుండగులు లోనికి ప్రవేశించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. చోరీచేసి పరారయిన దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా 3 సీసీయస్ పోలీసుల బృందాలు, 3 ఎల్బీనగర్ జోన్ బృందాలు రంగంలోకి దిగాయని సమాచారం. ఇటీవలే కొత్తగూడెం వద్ద పార్థీగ్యాంగ్ సభ్యుల్లో ఇద్దరిని నల్లగొండ పోలీసులు పట్టుకున్న సంఘటనను పలువురు గుర్తుచేసుకుంటున్నారు. ఆ గ్యాంగ్‌లోని మిగతా సభ్యులే గేటెడ్ కమ్యూనిటీ విల్లాలో చోరీ చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ గేటెడ్ కమ్యూనిటీలో చోరీ తీరుమాత్రం అందుకు భిన్నంగా ఉందని పోలీసుల అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

ఘనంగా ధోనీ జన్మదిన వేడుకలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 43వ పుట్టిన రోజు వేడుకలను అతడి అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ధోనీ తెలుగు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని చిల్డ్రన్ వెల్ఫేర్ అనాథాశ్రమంలో ఈ వేడుకలు జరిగాయి. అనాథాశ్రమంలోని 100 మంది పిల్లలకు క్రికెట్ కిట్లు, ఇతర క్రీడా సామగ్రి, దుస్తులు, నిత్యావసర వస్తువులను ధోనీ ఫ్యాన్స్ ఇచ్చారు. మహీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు.

మరియమాత వార్షికోత్సవం

బౌద్ధనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి నిత్యసహాయ మరియమాత ప్రార్థనామందిరం(అవర్ లేడీ ఆఫ్ పెర్‌పెత్యూల్ హెల్ప్ చర్చి)లో మరియమాత వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ మహోత్సవ వేడుకల్లో ఆర్చ్ బిషప్ పూల ఆంథోని ముఖ్య అతిథిగా పాల్గొని నిత్యసహాయ మరియమాత వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగరంలో వివిధ ప్రాంతాల వారు ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మరియమాతను సీతాఫల్‌మండి, నామాలగుండు, శ్రీదేవీ నర్సింగ్‌హోమ్, వారాసిగూడ, ఆర్ట్స్‌కాలేజీ, బౌద్ధనగర్ తదితర ప్రాంతాల్లో ఊరేగించారు. చర్చి ఫాదర్ థామస్, ఆనంద్‌జోసఫ్, క్రిష్టఫర్, జితేష్, మాథ్యూ, జోసఫ్ పాల్గొన్నారు.

కాచిగూడలో యువకుడి అదృశ్యం

● **ఉప్పల్‌లో జీరో ఎఫ్ఐఆర్.. కాచిగూడకు బదిలీ**

బర్కత్‌పుర జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడితో డబ్బుల విషయంలో మాట్లాడటానికి ఉప్పల్ నుంచి నెహ్రూనగర్‌కు వచ్చిన యువకుడు అదృశ్యమయ్యాడు. దాంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాచిగూడ పీఎస్‌కు బదిలీచేశారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అడ్మిని ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నేరెళ్లపల్లి గుడిగుంట తండాకు చెందిన రాజేష్(23) తన అన్న సూర్యతో కలిసి ఉప్పల్ చిలుకానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇన్వెస్ట్‌మెంట్ పథకం పేరుతో రాజేష్ తన స్నేహితుల నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేశాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని స్నేహితులు ఒత్తిడి తేగా రాజేష్ ఇద్దరికీ డబ్బులు తిరిగి ఇచ్చేశాడు. మరొక స్నేహితుడికి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా అతనితో మాట్లాడటానికి శుక్రవారం కాచిగూడ పీఎస్ పరిధిలోని నెహ్రూనగర్‌కు వచ్చాడు. ఆ తర్వాత అతడు కనిపించకుండాపోయాడు. దాంతో శనివారం రాజేష్ సోదరుడు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు ఆదివారం కాచిగూడ పీఎస్‌కు బదిలీచేశారు. కాచిగూడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పద్మ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో దొంగతనం

బౌద్ధనగర్, జూలై7(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోతున్నారు. వారాసిగూడ ఆర్ట్స్‌కాలేజీ ప్రధానరోడ్డు పక్కన ఉన్న పద్మ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. తాళాలు పగులగొట్టి కార్యాలయంలో ఉన్న ఫైల్స్‌ను చిందరవందర చేశారు. రెండో అంతస్తులో ర్యాక్‌లో ఉంచిన పదమూడు వేల రూపాయల నగదుతోపాటు పది చెక్కు బుక్‌లు, విలువైన పత్రాలను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆరుగంటలకు స్వీపర్ అంజమ్మ ఏజెన్సీ కార్యాలయం వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి ఉండటంతో వెంటనే యాజమాని గంగాధరగుప్తాకు సమాచారమందించింది.వెంటనే ఆయన వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లను కట్ చేశారు. గుప్తా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో.. భర్త ఆత్మహత్యాయత్నం

అడ్డగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సాకు చెందిన జలంధర్ సహాక్ కుటుంబ సభ్యలతో కలిసి టోలిచౌక్‌లో అద్దెకు ఉంటున్నారు. గత కొద్ది రోజులుగా మానసికంగా ఆయన పరిస్థితి బాగా లేదు. ఆదివారం ఒడిస్సా నుంచి సికింద్రాబాద్‌కు భార్యతో కలిసి వచ్చారు. సికింద్రాబాద్‌లో భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో సహాక్ జేబులో ఉన్న బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతనిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హమ్మయ్య... మంచినీళ్లొచ్చాయి

● ఆనందం వ్యక్తం చేస్తున్న అడ్డగుట్ట మహిళలు
● రంగంలోకి దిగిన జలమండలి జీఎం, అధికారులు
● సమస్య పరిష్కారం

జాడలేని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్





అడ్డగుట్టలో నల్లాలో నీరును పరిశీలిస్తున్న మారేడుపల్లి జలమండలి జీఎం వినోద్, ఏఈ స్రవంతి

అడ్డగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): 'అడ్డగుట్టలో మంచినీటికి కటకట' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో ఆదివారం మారేడుపల్లి వాటర్ వర్క్స్ జీఎం వినోద్ స్పందించి వెంటనే రంగంలోకి దిగారు. జీఎంతోపాటు మారేడుపల్లి ఏఈ స్రవంతి సూపర్‌వైజర్ ఖాజా అడ్డగుట్ట మజీద్ వద్ద మంచి నీరు వస్తున్నాయా లేదా అనే విషయంపై సర్వే చేశారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు స్పందించిన ఏఈ స్రవంతి ఈ బస్తీ పక్కనే మ్యాన్‌హోల్, చిత్తుకాగితాలు, కొబ్బరిబొండాలు, చెత్తచెదారం పేరుకుపోయి బస్తీవాసులకు నీళ్లు రాకుండాపోయాయని, సమస్యను తెలుసుకుని వెంటనే పరిష్కారం చేసిన అనంతరం, ఆదివారం దాదాపు రెండు వందల ఇళ్లకు మంచినీరు అందించే దిశగా శాశ్వత పరిష్కారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సమస్యను తెలుసుకున్న జీఎం వినోద్ మరోసారి ఇలా కాకుండా చూస్తామని బస్తీప్రజలకు హామీఇచ్చారు. దాంతో అడ్డగుట్ట మజీద్ వద్ద ఉన్న కాలనీ మహిళలు ఆనందం వ్యక్తంచేశారు. కాలనీలో ఉన్న రెండు వందల మందికి నీటి సమస్య పరిష్కరించిన ఏఈ స్రవంతికి జీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

స్పందించిన ఎమ్మెల్యే పద్మారావు

అడ్డగుట్ట డివిజన్‌లో మంచినీటి సమస్యపై వెంటనే పరిష్కరించాలని కోరుతూఆయా జలమండలి అధికారులకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైతే సమస్య ఉందో చూసి ఇకనుంచి మంచినీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు మెరుగుపరచాలన్నారు.

జాడలేని అడ్డగుట్ట కార్పొరేటర్

మారేడుపల్లి జలమండలి జీఎం వినోద్ అడ్డగుట్టలో పర్యటిస్తున్నారని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మికి సమాచారం ఉన్నప్పటికీ కార్పొరేటర్ కనిపించకుండా పోయారు. అడ్డగుట్టలో మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతుందన్న కారణంగానే కార్పొరేటర్ అడ్డగుట్టకు రాలేదని కొందరు మహిళలు తెలిపారు. రెండు నెలల నుంచి మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కార్పొరేటర్ పట్టించుకోలేదని, ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు స్పందించి సాక్షాత్తు జలమండలి జీఎంతో పాటు ఏఈ ఇతర అధికారులు అడ్డగుట్టకు వచ్చి శాశ్వత పరిష్కారం చేశారని, ఈ విషయం కార్పొరేటర్‌కు తెలిసి అడ్డగుట్టకు రాకపోవడంతో అడ్డగుట్ట మహిళలు మండిపడుతున్నారు.